
# సన్మానం

**వసుంధర**

దీపావళి ప్రత్యేక సంచికలో నా కథ వేస్తున్నట్లు యువ నుంచి ఉత్తరం వచ్చింది. కొత్తగా రచనలు ప్రారంభించిన నాబోటివాడికి అంతకు మించిన ప్రోత్సాహ మేముంటుంది?

నాలోనుంచి ఆవేశం పుట్టింది. కాగితం, కలం అందుకున్నాను. నన్ను డిస్టర్బ్ చెయ్యవద్దని శ్రీమతిని హెచ్చరించాను. ఎవరైనా నాకోసంవస్తే ఏదో వంకపెట్టి బయటకు పంపేయమన్నాను.



"ఏమిటండీ ఈ హడావుడంతా?" అంది శ్రీమతి.

అప్పటికి రెండేళ్ళనుంచి రచనలు చేస్తున్నాను. పది కథలు, రెండు నవలానుబంధాలు వచ్చాయి. ఇంతవరకూ ఎప్పుడూ రచన చేయడానికి నేనింత హడావుడి చేయలేదు.

"ఇప్పుడు మార్కెట్లో ఉన్న పెద్ద రచయితలందర్నీ పడగొట్టే సీరియల్ ఒకటి రాస్తాను. అందులో అతీంద్రియ శక్తులుంటాయి. విజ్ఞానశాస్త్రముంటుంది. మాంత్రికులుంటారు. కార్లూ, విమానాలూ ఉంటాయి. అది చదువుతూంటే పాఠకులకు తామే యుగంలో ఉన్నదీ తెలియదు. కానీ నేను మాత్రం సాహిత్యంలో యుగకర్తగా పేరు తెచ్చుకుంటాను-" అన్నాడు ఆవేశంగా.

"దీనికోసం చక్కటి సెలవురోజు పాడుచేసుకుంటారా?" అంది శ్రీమతి.

"ప్రతినెలా రెండో శనివారం పూర్తిగా రచనలకే వినియోగిస్తానని నేనంటే - నువ్వొప్పుకున్న విషయం మర్చిపోయావా?" అన్నాడు.

"అదికాదండీ-మీరు గొప్ప సీరియల్ రాయడానికి పూనుకుంటూ - అందుకు సెలవు పాడుచేసుకుంటున్నారు. మీ సీరియల్‌కు పేరు రావాలంటే - అది గొప్పగా ఉండి లాభంలేదు. అందుకు ప్రచారం కావాలి!" అంది శ్రీమతి.

"నా రచనలే నాకు ప్రచారం!" అన్నాను.

"అలాగనుకుంటే మంచి రచనలు చేయగలరేమోకానీ మీ రచనలకు పేరు రాదు......"

"అంటే?"

శ్రీమతి వివరించింది.

ఒక నవల పాఠకులను ఆకర్షించాలంటే అందుకు విపరీతమైన ప్రచారం కావాలి. ఆ నవలగురించీ, రచయిత గురించీ ఆకాశానికెత్తేస్తూ ప్రకటనలు వేయించాలి. నవలలోని అంశాలపై

పోటీలుపెట్టాలి. రచయితతో ముఖాముఖీ శీర్షికలు వేయించాలి. అటుపైన ఆ నవల యువతరాన్ని పాడుచేస్తోందన్న విమర్శ బయల్దేరాలి. దానిపైన చర్చలు. చర్చల్లో పాల్గొనేవారు చెప్పేది అవును, కాదు అని మాత్రమే అయినప్పటికీ వారి వారి ఫొటోలు కూడా వేయించాలి.

"ఇంత హడావుడి చేయాలంటే మనకు పేరుండాలి. పేరుంటేకానీ ఇంత హడావుడీ జరగదు?" అన్నాను నీరసంగా.

"ఈ ఊళ్ళో ఒక్క కథరాసి సన్మానాలు చేయించుకున్నవాళ్ళను చూశాను. రెండేళ్ళలో పదికథలూ, రెండునవల్లూ రాసినా ఇంతవరకూ మీకు సన్మానమే జరుగలేదు, సన్మానం జరిగితే తప్ప మీకు పేరు రాదు......"

"సన్మానం జరిగితే తప్ప పేరు రాదంటావా?" అన్నాను.

"రాదు. మీకు సన్మానం జరిగితే అప్పుడు మీరు మాట్లాడుతూ ఓ గొప్ప సీరియల్ నవల ప్రారంభించాననీ-ఇంకా ఏ పత్రికకు పంపాలో నిర్ణయించుకోలేదనీ ప్రకటించవచ్చు. ఆ వార్త అన్ని పత్రికల్లోనూ వస్తుంది. మీ కప్పుడు ఎడిటర్స్ ఉత్తరాలు రాస్తారు......" అంది శ్రీమతి.

"కానీ నన్నెవరు సన్మానిస్తారు?"

"ఎవరైనా సన్మానించేవరకూ మీకు గొప్ప రచయితయ్యే అవకాశం లేదు. ఆ అవకాశం లేనంతకాలం అపూర్వమైన సెలవుల్ని పాడుచేసుకోకండి-" అంటూ పాయింటుకు వచ్చింది శ్రీమతి.

అప్పటికి నా మూడంతా పాడైపోయింది. కానీ సరిగ్గా అప్పుడే ఎవరో మా యింటి కాలింగ్ బెల్ మ్రోగించారు.

నేనే వెళ్ళి తలుపు తీశాను.

వచ్చినతడు తనపేరు కాళిదాసు అని చెప్పాడు. అతణ్ణి అంతవరకూ నేనెప్పుడూ చూసి ఉండలేదు.

"రాఘవేంద్ర మీరే కదూ!" అన్నాడతడు.

"అవును-" అన్నాను ప్రశ్నార్థకంగా

"మీ రచనలు చదివాను. నేను మీ అభిమానిని-" అన్నాడతడు.

నా కెంతో సంబరం కలిగింది. రెండేళ్ళుగా రచనలు చేస్తున్నా నాకు అభిమానులంటూ ఎవరూ ఏర్పడలేదు. ఎక్కణ్ణించీ కథ బాగుందంటూ ఓ ఉత్తరంముక్క కూడా ఎరుగను నేను.

"రండి-రండి-" అంటూ అతణ్ణి లోపలకాహ్వానించాను.

ఇద్దరం చెరో కుర్చీలోనూ కూర్చున్నాం.

ఒకే ఊళ్ళో ఉంటూ ఇన్నాళ్ళు కలుసుకోలేకపోయినందు కతడెంతో బాధపడ్డాడు నా ప్రతికథా పేరుపేరునా చెప్పి మెచ్చుకున్నాడు. నావంటి కథకులు -అరుదన్నాడు. అంత మంచి ప్లాట్సు నాకెలా స్ఫురిస్తాయో తెలుసుకోవాలని కుతూహలపడ్డాడు. వివిధరంగాల విశేషాలపై నా అభిప్రాయాలడిగి తెలుసుకుని-నా ఔన్నత్యాన్ని మెచ్చుకున్నాడు.

"మీరు నన్ను మరీ ఆకాశానికెత్తేస్తున్నారు-!" అన్నాను సంతోషానికి తట్టుకునేందుకు ప్రయత్నిస్తూ.

"ఈమాత్రానికే అలాగంటే ఎలా? నేను మీకు సన్మానసభ ఏర్పాటుచేయాలని వచ్చాను......"అన్నాడు కాళిదాసు.

నాకు నోట మాట రాలేదు.

కొద్దిక్షణాల క్రితమే నేనూ, శ్రీమతీ ఈ విషయం అనుకున్నాం. అంటే నేను గొప్ప రచయతను కానున్న క్షణం ఆసన్నమయిందన్నమాట!

శ్రీమతి వెంటనే లేచి లోపలకు వెళ్ళింది. అంత సేపూ ఆమె కూడా అక్కడేఉండి మా సంభాషణ వింటోంది. సన్మానం గురించి వినగానే ఆమె కళ్ళు మెరిశాయి. నన్ను సన్మానించనున్న వ్యక్తిని కనీసం ఓ కప్పు కాఫీతోనైనా సన్మానించాలనుకుందేమో-మరి-వెంటనే లోపలకు వెళ్ళింది.

"నాకు సన్మానమా?" అన్నాను

"రచయితగా ఈఊరికే గర్వకారణం మీరు. ఇప్పటికే మిమ్మల్ని సన్మానించడం ఆలస్యమైంది. ఉత్తమ కళాకారులను సన్మానించడమే వృత్తిగా పెట్టుకున్న నాబోటివాడు పూనుకునేదాకా మీ సన్మానం గురించి ఇతరులెవ్వరూ ఆలోచించకపోవడం శోచనీయం—" అన్నాడు కాళిదాసు.

అతడి మాటలకు కంగారుపడుతూ-. "సన్మానించడం మీకు వృత్తి అంటున్నారు అంటే ఇది వ్యాపారానికి సంబంధించినదా?" అన్నాను.

కాళిదాసు ఫెళ్ళున నవ్వాడు— "రచయితలు...మీకు నేను పదాల అర్థం చెప్పగలవాణ్ణికాదు. వృత్తి అంటే నన్ను మీరు తప్పుగా అర్థంచేసుకున్నారు. పోనీ కళాకారులను సన్మానించడం నాకు వృత్తికాదు — బాధ్యత అనుకోండి! డబ్బుచ్చుకుని సన్మానాలు చేసే అలగా మనిషిని కాను. అందులోనూ మీవంటి పెద్ద రచయితలను సన్మానించడానికి మేమే మీకిచ్చుకోవాలిగానీ - మిమ్మల్ని డబ్బడుగుతామా-ఎంతమాట?"

నాకు గుండె కాస్త తేలికయింది.

శ్రీమతి కాళిదాసుకు కాఫీ తెచ్చిచ్చింది. అతడది తాగి - "బహుశా - మీ చేతి కాఫీయే మీ శ్రీవారికి ప్రేరణ అనుకుంటాను. చాలా గొప్పగా ఉంది. సన్మానసభలో చదవడానికి సన్మాన పత్రిక తయారుచేసేముందు మీ చేతి కాఫీ మరోసారి తాగుతాను-" అన్నాడు.

అప్పటికే పెళ్ళయిపోయింది కాబట్టి కానీ ఆ మాటలకు శ్రీమతి అతణ్ణి ప్రేమించేసి ఉండాల్సింది.

కాళిదాసు వెళ్ళిపోయాక నేను, శ్రీమతి విషయాన్ని కూలంకషంగా చర్చించాం. రచయితగా నా కుజ్వల

భవిష్యత్తున్నదన్న విషయం ఆ చర్చలో ధృవపడింది.

"సన్మానం గురించి అందరికీ చెబుదామా?" అంది శ్రీమతి

"అప్పుడే వద్దు. విషయం ధృవ పడనీ-" అన్నాను. అదే మంచిదయింది,

అలా రెండువారాలు గడిచేక ఓ రోజు సాయంత్రం కాళిదాసు మా యింటి కొచ్చాడు. నేను, శ్రీమతి అతణ్ణి బాగా మర్యాదచేశాం.

కాళిదాసు కాస్త యిబ్బందిగానూ. కంగారుగానూ ఉన్నాడు

"నన్ను మీరే రక్షించాలి!" అన్నాడతను

"ఏమయింది?" అన్నా ననుమానంగా.

"మీకు బొమ్మలు గీయడం వచ్చు కదూ?" అన్నాడు కాళిదాసు.

"రాదు..." అన్నాను.

"అయితే ఆ పెయింటింగెవరిది?"

గోడకు వ్రేలాడుతున్న ఆ రాధా కృష్ణుల పెయింటింగుమీద నా పేరుంది కానీ అది నా స్నేహితుడు నాకోసం వేసిచ్చాడు. అదే కాళిదాసుకు చెప్పాను.

కాళిదాసు ముఖంలో రవంత నిరుత్సాహం చూశాను- "పోనీ కార్టూన్లైనా గియ్యగలరా?" అన్నాడతడు.

"నావల్ల కాదు..." అన్నాను.

"అదేంటండీ కార్టూనిస్టులు కథలు రాస్తున్నారు. కథకులై ఉండీ కార్టూన్లు గియ్యలేరా?" అన్నాడతడు నిష్ఠూరంగా.

ఉన్నట్లుండి అతడి ధోరణి ఇలా మారడంలో నా మనసు చివుక్కుమంది. "కార్టూన్లు గియ్యడం ఒక ప్రత్యేక కళ..." అన్నాను.

"పోనీ-మీకు పాటలొచ్చా?" అన్నాడు కాళిదాసు.

"ఏం?" అన్నాను.

"ఈరోజుల్లో పాటలురానివాళ్ళుండరు —అందుకని!"

"అంతమాత్రాన అది ప్రత్యేకమైన కళకాకుండా పోతుందా?" అన్నాను.

"మీకు వచ్చో రాదో చెప్పండి!" అన్నాడు కాళిదాసు.

"బాత్రూంలో కూనిరాగం కూడా తీయలేను-" అన్నాను.

"మీవంటి రచయితనెక్కడా చూడ లేదు!" అంటూ నిట్టూర్చాడు కాళిదాసు.

"అంటే?" అన్నాను దెబ్బతిని.

"కథ వ్రాయడంకాక మీకు ప్రవేశమున్న కళ ఇంకొకటి చెప్పండి..."

నాకు చిరాకు వచ్చింది-"ఏమీ లేదు అయినా మీరింతలా అడుగుతూంటే- అసలు నాకు కథ వ్రాయడం మాత్రం వచ్చా అన్న అనుమానం కల్గుతోంది-" అన్నాను

"అలాగంటే ఎలా? ఇంకే కళలోనూ ప్రవేశం లేకపోతే మిమ్మల్ని సన్మానించేదెలా?" అన్నాడు కాళిదాసు దిగులుగా.

నాకు మతిపోయినట్లయింది- "సన్మానానికి నా కథలు పనికిరావా?"

"పనికొస్తాయి కానీ......"

అతడు విషయం చెప్పడానికి కాసేపు పట్టింది.

కాళిదాసుకు పెద్ద పరిచయాలు కావాలి. అందుకే అతడు సన్మానసభ లేర్పాటు చేసి దానికి మంత్రులను ముఖ్య అతిధులుగా పిలుస్తారు త్వరలో ఈ ఊళ్ళో




జరుగనున్న సన్మానసభకు తేదీ, ముఖ్య అతిధి నిర్ణయమైపోయాయి. సాంస్కృతిక శాఖామాత్యులు దయతో సన్మాన సభకు ముఖ్య అతిధి కావడానికి అంగీకరించారు. అయితే వారి పియ్యే కాళిదాసుకో ముఖ్యసూచన ఇచ్చాడు. మంత్రివర్యులకు పక్షపాత బుద్ధి ఉన్నదన్న పేరు రాకుండా ఉండడంకోసం ఆయన అన్ని రంగాల కళాకారులనూ సమంగా గౌరవిస్తారు. ఆ విధంగా ఈ సంవత్సరానికి వారిక కవులు, రచయితల సన్మానసభలకు వెళ్ళరు. ఆ కోటా అయిపోయింది. ఇంకా చిత్రకారులకు, గాయకులకు కొంత కోటా మిగిలిఉంది.

"సన్మానం మీకు చేస్తానని చెప్పి- మరొకరికి ఏర్పాటు చేయలేను. అలాగని మంత్రివర్యులను మార్చలేను. లేకుంటే ఆర్థిక శాఖామాత్యుల వద్ద ఇంకా రచయితల సన్మానానికి కొంత కోటా మిగిలి ఉంది. సాంస్కృతిక శాఖామాత్యుల నడిగేక వారిని కాదని ఆర్థిక శాఖామాత్యుల నడుగలేము కదా...అందుకని మీరే మీ ఫీల్డును మార్చుకుంటే బాగుంటుందనిపించింది. ఆలోచించి చూడండి-మీకూ మంత్రిగారి పరిచయమవుతుంది......"

ఏమనాలో నాకు తెలియలేదు...

నేనాలోచిస్తున్నానని కాళిదాసు కాసేపు ఎదురుచూసి నానుంచి ఏ సమాధానమూ రాకపోయేసరికి తనే శ్రీమతి వైపు తిరిగి-"పోనీ-మీకు పాడడం వచ్చా?" అన్నాడు.

"నాకా?" అంది శ్రీమతి తెల్లబోయి.

"అవును మీ గొంతు వీణ మీటినట్లుంది. మీరు పాడితే తప్పక బాగుంటుంది. సన్మానం మీకే జరిపిస్తాను. సన్మానం మీ యింటికే పరిమితమైతే అదో తృప్తి నాకు..." అన్నాడు కాళిదాసు.

"కానీ-నేను సన్మానానికి అర్హమైనంత గొప్ప గాయకురాలిని కాదు. ఏదో పాడగలను-అంతే!" అంది శ్రీమతి కంగారుగా.

"బాగుంది. ఈ సన్మానాలు చేయించుకునే వాళ్ళందరికీ పెద్ద అర్హత లున్నాయనుకుంటున్నారేమిటి? అందరూ అంతంత మాత్రం సమర్థురే' అన్నాడు కాళిదాసు.

అతడే ఉద్రేకముతో అన్నప్పటికీ ఆ మాటలు సూటిగా నాకే తగిలాయి.

తనకు సన్మానమనగానే శ్రీమతి మెత్తబడింది. కాళిదాసు వెళ్ళిపోయాక అతడు చాలా పెద్దమనిషని మెచ్చుకుంది. ఎందుకైనా మంచిదని ఆ మర్నాటి నుంచీ సంగీత సాధన ప్రారంభించింది. ఓ గురువును కూడా పెట్టుకుంది.

మరో రెండు వారాలు గడిచాయి.

ఒకరోజు ఉత్సాహంగా కాళిదాసు మా యింటికొచ్చాడు. మళ్ళీ ఏం కబురు తెచ్చాడోనని నేను భయపడ్డాను. అతడు మాత్రం- "గురువుగారూ! శుభవార్త... మీలోని రచయితను సన్మానించుకునే యోగం నాకుంది..." అన్నాడు.

"అంటే?"

"సన్మానసభకు ముఖ్య అతిధిగా సాంస్కృతిక శాఖామాత్యులు రావడం లేదు. ఆర్థిక శాఖామాత్యులు వస్తున్నారు..." అన్నాడు కాళిదాసు.

"ఎందుకని?"

"ఆరోగ్య కారణాలవల్ల ఆయన అమెరికా వెడుతున్నారు నిజానికి సాంస్కృతిక శాఖకంటే ఆర్థికశాఖ పెద్దది..." అన్నాడు కాళిదాసు.

"పోనీ-వారు తిరిగి వచ్చేదాక ఆగవచ్చు కదా!" అన్నాను.

"అదెలా సాధ్యం? ఒక మంత్రి కదిలివచ్చినపుడాయన్ని బిజీగా ఉంచడానికేగదా-ఇలాంటి సభలన్నీ ఏర్పాటు చేస్తాం! ప్రత్యేకంగా సన్మాన సభకు మంత్రి నాహ్వానించే ఆర్థిక స్తోమతు ఎందరికో ఉండదు..."

అసలు విషయం నాకప్పుడర్థమైంది

మా ఊరికి దగ్గర్లో ఎదో శంకుస్థాపన ఉంది. దానికి సాంస్కృతిక శాఖామాత్యులు రావాల్సి ఉంది. ఆ సందర్భాన్ని పురస్కరించుకుని కాళిదాసు నాకు సన్మానసభ ఏర్పాటు చేయాలనుకున్నాడు. రచయితల సన్మానానికి ఆ అమాత్యులకు కోటా లేదు. అందుకని శ్రీమతిని సన్మానించాలనుకున్నాడు.

ఇప్పుడు శంకుస్థాపనకు ఆర్థిక శాఖామాత్యులు వస్తున్నారు. ఆయన వద్ద ఇంకా రచయితలను సన్మానించడానికి కోటా మిగిలి ఉంది.

ఇటువంటి సన్మానానికి నాలోని రచయిత వెగటుగా ఫీలయ్యాడు. నేను వెంటనే-"నాకీ సన్మానం వద్దు. నా శ్రీమతికి జరిపించండి-" అన్నాను.

"సన్మానసభ లేర్పాటుచేయడంలో మా కెన్నో లొసుగులుంటాయి. దానికి మీరు చిన్నబుచ్చుకోరాదు. అన్యధా భావించరాదు. ఈ సన్మానం మీకే జరుగుతుంది మీరు తప్పక అంగీకరించాలి..." అన్నాడు కాళిదాసు.

"మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు. నే నేమీ చిన్నబుచ్చుకుని ఇలా అనడం లేదు. తనకు సన్మానం జరుగనున్నదని నా శ్రీమతి పొంగిపోతోంది. ఇప్పుడామెను నిరుత్సాహపచ్చడం నా కిష్టంలేదు..." అన్నాను.

"కానీ-తప్పదు......" అన్నాడు కాళిదాసు.

"ఎందుకని?"

"గాయకులను సన్మానించడానికి ఆర్థిక మంత్రివద్ద కోటా లేదు..." అన్నాడు కాళిదాసు.

నేను తెల్లబోయాను. సన్మానాలకు మంత్రుల కోటాలో తప్ప-కళాకారుల



అహ్లాతతో నిమిత్తం లేదా? జరుగుతున్న సన్మానాలన్నీ ఈ విధంగానే జరుగుతున్నాయా?

"అయాం సారీ-ఇలాంటి సన్మానాలు మాకొద్దు..." అన్నాను.

కాళిదాసు చిన్నబుచ్చుకుని-"సన్మానాలకు ఎదురొచ్చి ఎగబడేవారున్నారు. నేను మీమీద గౌరవంకొద్దీ ఇంతగా ప్రాకులాడుతున్నాను తప్పితే వేరే మనుషులు దొరక్క కాదు..." అన్నాడు.

"చూడండి కాళిదాసుగారూ! మీ పరిస్థితి నే నర్థం చేసుకోగలను. తన్ను కాదని నేను సన్మానం చేయించుకుంటే నా భార్య నన్నపార్థం చేసుకుంటుంది. అదే నా సమస్య" అన్నాను.

కాళిదాసు ఉన్నట్లుండి- "మీ అసలు పేరు శంకర్రావు కదా..." అన్నాడు.

"అయితే?"

"రాఘవేంద్ర మీ కలంపేరు గదా!"

"అవును..."

"అయితే ఇంకేం? సన్మానం జరిగేది మీకు కాదు. "రాఘవేంద్ర"కు. రాఘవేంద్ర మీ శ్రీమతి కలం పేరు. ఇంకేమీ చెప్పకండి. ఒప్పేసుకోండి...." అనేసి కాళిదాసు వెళ్ళిపోయాడు.

ఈసారి ఏ యిబ్బంది లేకుండా శ్రీమతికి మంత్రివర్యులచేత నిజంగానే సన్మానం జరిగింది. నూటపదహార్లున్న పర్సుకూడా ఆమెకు ప్రెజంట్ చేసారు. అటువంటి గొప్ప రచయిత్రిని సన్మానించే అవకాశం వచ్చినందుకు మంత్రివర్యులేకాక ఎందరో వక్తలు సంతోషిస్తూ మాట్లాడేరు.

రచయితగా నాకింకా గొప్పపేరు రాలేదు. మరిన్ని సన్మానాలు జరిగే అవకాశం పోగొట్టుకోవద్దని నేనిప్పుడు శ్రీమతితోపాటు సంగీతం నేర్చుకోవడమే కాక-తపాలాపద్ధతిని చిత్రకళ అభ్యసిస్తున్నాను. అందువల్ల రచనలు చేయడానికి టైముండడంలేదు.

ఆ విధంగా సన్మానం పేరు చెప్పి-నేను రాయాల్సిన అద్భుత సీరియల్ నవలకింకా శ్రీకారం చుట్టబడలేదు. పాఠకుల అదృష్టం ఎప్పటికి పండుతుందో మరి! □


With best compliments from

**THEATRE KINNERSANI**

WATER TANK ROAD, **KHAMMAM**

Phone: Theatre: 8548 Resi: 8948

*Managing Partner:* P. RAJENDRA PRASAD, B.A.